క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ఏలూరు టౌన్‌: విజయవాడకు చెందిన వృద్ధురాలు ఏలూరులోని తన కుమార్తె ఇంటికి వస్తుండగా రాత్రివేళ శాంతినగర్‌ 14వ రోడ్డులో నడచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు ఆగంతకులు వృద్ధురాలి మెడలోని గొలుసును లాక్కెళ్లారు. విజయవాడకు చెందిన వెంకటేశ్వరి అనే వృద్ధురాలు ఏలూరు సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనలో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకు ఏలూరు వచ్చింది. ఈనెల 12న రాత్రి వేళ శాంతినగర్‌ 14వ రోడ్డులో నడచుకుంటూ కుమార్తె ఇంటికి వెళ్తుండగా ఇద్దరు ఆగంతకులు మోటారు సైకిల్‌పై వచ్చి వృద్ధురాలి మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఏలూరు త్రీటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల ట్రాఫిక్‌ పార్క్‌ ప్రారంభం



ట్రాఫిక్‌ పార్క్‌ ప్రారంభిస్తున్న ఎస్పీ శివకిషోర్‌, జేసీ ధాత్రిరెడ్డి, ఎంపీ మహేష్‌, ఎమ్మెల్యే బడేటి

ఏలూరు టౌన్‌: ఏలూరు జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా చిన్నారుల ట్రాఫిక్‌ పార్క్‌ను నిర్మించారు. సుమారు రూ.84 లక్షల వ్యయంతో పిల్లలకు ట్రాఫిక్‌ నిబంధనల పట్ల అవగాహన కల్పించేలా నిర్మించిన పార్కును ఏలూరు జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్‌ శివకిషోర్‌, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ కుమార్‌, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఇడా ఛైర్మన్‌ పెద్దిబోయిన శివప్రసాద్‌ ఆదివారం ప్రారంభించారు. రహదారి భద్రతా విద్యతోపాటు, చిన్నారులకు ఆటవిడుపుగా ఉండేలా ఈ పార్కును తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏలూరు మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌, ఏలూరు త్రీటౌన్‌ సీఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్‌ సీఐ ఎస్‌.లక్ష్మణరావు, ఏఆర్‌ డీఎస్పీ చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్‌ ఆదివారం తెలిపారు. చొప్పరామన్నగూడెంలో సీఐ బాల సురేష్‌ ఆధ్వర్యంలో దాడి చేయగా వారి నుంచి రూ.42,800 నగదు, ఐదు మోటార్‌ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సమాచారాన్ని డయల్‌ 112 లేదా 9440796666 ద్వారా అందిస్తే, జూదరులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇదెక్కడి పారిశుద్ధ్య చోద్యం?

- ఏలూరులో క్లాప్‌ ఆటోల రద్దుతో కొండలా పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- ఉన్న కొద్దిపాటి వాహనాలతో చెత్త తరలింపు కష్టతరం
- వేధిస్తున్న సిబ్బంది కొరత



కొమడవోలు ప్రాంతంలోని మెయిన్‌ రోడ్డు పక్కనే గుట్టగా పోస్తున్న చెత్త



కొమడవోలులో రోడ్డుపై పోసిన చెత్త కుప్పను చిందర వందర చేస్తున్న ఆవు



మంచెం అప్పారావు నగర్‌ వద్ద మెయిన్‌ రోడ్డు పక్కగా వేస్తున్న చెత్తకుప్ప



ఎన్‌ఆర్‌పేటలో పేరుకుపోయిన చెత్త

ఏలూరు (టూటౌన్‌): ఏలూరు నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్య సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్లాప్‌ ఆటోల రద్దుతో పేరుకుపోయిన చెత్త కుప్పలను తరలించేవారు లేక వాటి నుండి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ఆయా మార్గాల గుండా రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య లేకపోవడం వల్ల ఉన్న కొద్దిపాటి సిబ్బందితో క్లీన్‌ ఏలూరు నగరంగా తీర్చిదిద్దడం అనేది కలగానే మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉంది.

క్లాప్‌ ఆటోలు, సిబ్బంది తొలగింపే కారణం

ఏలూరు నగరపాలక సంస్థపరిధిలో గతంలో 60 క్లాప్‌ వాహనాలు ఇంటింటి చెత్తను తరలించేందుకు వినియోగించేవారు. వీటిలో పనిచేసే 60 మంది ఆటో డ్రైవర్లు తెల్లవారే సరికి నగరంలోని అన్ని మూలల నుంచి చెత్తను డంపింగ్‌ యార్డుకు తరలించడంలో విశేష కృషి చేసేవారు. నగరంలోని ఇంటి యజమానుల నుంచి నామమాత్రపు చెత్త పన్నును వసూలు చేసి ఆ మొత్తాన్ని క్లాప్‌ ఆటోలు, సిబ్బందికి వేతనాలుగా చెల్లించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం క్లాప్‌ ఆటోల కాంట్రాక్టర్లు గత ప్రభుత్వం హయాంలో ఉన్నవారు కాబట్టి వారంతా వైఎస్సార్‌ సీపీకి చెందిన వారిగా భావించి ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏలూరు నగరంలో క్లాప్‌ఆటోలను రద్దు చేసి, సిబ్బందిని తొలగించేశారు. దీంతో నగరంలోని చెత్తను నగరపాలక సంస్థకు చెందిన కొద్దిపాటి వాహనాలతో డంపింగ్‌ యార్డుకు తరలిస్తున్నారు. దీంతో చెత్తను రోజు విడిచి రోజు, ఒక్కోసారి వారానికి రెండు సార్లు మాత్రమే తరలించే పరిస్థితి నెలకొంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సుమారు వెయ్యి మంది వరకు ఉన్నారు. వీరిలో 200 వరకు రెగ్యులర్‌ సిబ్బంది ఉండగా మిగిలిని 800 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు కాంట్రాక్ట్‌ పద్ధతిలోనే పని చేస్తున్నారు. వీరిలోనూ కొంతమందిని ఇతర పనులకు వినియోగిస్తుండటంతో వీధులను శుభ్రపరచే పనుల్లో సుమారు 800 మంది వరకే పని చేస్తున్నారు. ఏలూరు నగర జనాభా, విస్తీర్ణం మేరకు కార్పొరేషన్‌లో దాదాపు 1500 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సిన అవసరం ఉందని వివిధ కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

కొమడవోలులో అధ్వానంగా పారిశుద్ధ్యం

ఏలూరు నగరంలోని విలీన పంచాయతీల్లో ఒకటైన కొమడవోలు ప్రాంతంలో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా తయారైంది. ఇక్కడ కనీసం చెత్తను వేసేందుకు డస్టు బిన్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు, ప్రజలు తమ ఇండ్లలోని చెత్తను, దుకాణాల్లో వస్తున్న చెత్తను, ప్లాస్టిక్‌ వ్యర్థాలను తీసుకువచ్చి నేరుగా మెయిన్‌రోడ్డు పక్కగా ఇష్టానుసారంగా పడవేస్తున్నారు. వందలాది వాహనాలు తిరిగే తూర్పు లాకుల నుంచి పోతునూరు వరకు ఉన్న ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలను పడవేస్తుండటంతో వాహనదారులు నిత్యం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి కన్పిస్తుంది. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తరలించే కార్యక్రమాన్ని చేపడుతున్నా చెత్త ఎక్కువగా ఉందనే కారణంతో కొద్దికొద్దిగా వదిలివేస్తున్నారు. దీంతో ఈ చెత్తను పందులు, పందుకొక్కులు, ఆవులు, వంటివి చిందరవందర చేసి రోడ్డుపైకి లాక్కుని వచ్చేయడంతో ఆప్రాంతంలో దుర్గంధం వెదజల్లే పరిస్థితి కన్పిస్తుంది. పూర్తి స్థాయిలో చెత్తను తరలిస్తేనే దీనికి అడ్డుకట్ట వేయవచ్చునని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

కొరవడిన అధికారుల అజమాయిషీ

గత కొంత కాలంగా ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో మున్సిపల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతంలో డిప్యూటీ కమీషనర్‌ శివారెడ్డి,ఏలూరు టూటౌన్‌ ప్రాంతంలో అసిస్టెంట్‌ కమిషనర్‌ జి.చంద్రయ్యలు పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. అయితే వీరిద్దరూ కనీసం క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించకపోవడంతో సిబ్బంది వారి ఇష్టానుసారంగా చేసుకుపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో సిబ్బంది సైతం తమకు నచ్చిన విధంగా పనులు చేసుకు వెళుతున్నారనే పట్టణవాసులు విమర్శిస్తున్నారు.

మెయిన్‌ రోడ్డుపై సైతం ఇబ్బందులు



రోజూ మల్కాపురం నుండి ఏలూరుకు మూడు సార్లు వచ్చి వెళుతుంటాను. ఈ క్రమంలో మల్కాపురానికి ఆనుకుని ఉన్న కొమడవోలు ప్రాంతంలో రోడ్ల పక్కనే చెత్త కుప్పలు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పల నుంచి వ్యర్థాలను రోడ్లపైకి మూగజీవాలు లాక్కుని వస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో రోడ్డుపై ద్విచక్రవాహనం పై వెళ్ళినప్పుడల్లా ముక్కు మూసుకుని వెళ్ళాల్సి వస్తుంది. – వెంపా నాగరాజు, స్థానికుడు, మల్కాపురం

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలి



ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి. అప్పుడే నగరంలో చెత్త సమస్య పరిష్కారం అవుతుంది. కేవలం ప్రధాన రహదారులు, అధికారులు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే శుభ్రం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో చెత్త సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీనిపై కార్పొరేషన్‌ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. – వైఎస్‌ కనకారావు, స్థానికుడు, ఏలూరు

క్లాప్‌ ఆటోల రద్దుతోనే సమస్య పెరిగింది



ఏలూరు నగరపాలక సంస్థపరిధిలో చెత్త సేకరణ చేసే క్లాప్‌ ఆటోల సేవలను దూరం పెట్టడం, వాటిలో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించడంతోనే చెత్త సమస్య ఎక్కువైంది. అంతకు ముందు ఏ రోజుకారోజు చెత్త తరలింపు కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగేది. తాజాగా ఆ వ్యవస్థను రద్దు చేయడంతో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. – జి.గోపీ, సీఐటీయూ నగర నాయకుడు, ఏలూరు

సినీ నటుడు కోట మృతి తీరని లోటు



ఏలూరు హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కోట శ్రీనివాసరావు (ఫైల్‌)

ఏలూరు (టూటౌన్‌): సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. చలనచిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి, ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన కోట శ్రీనివాసరావు మరణం సినీ రంగంతో పాటు తెలుగు వారందరికీ బాధాకరమని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా నటుడిగా, క్యారెక్టర్‌ ఆర్టిస్టుగా, ప్రతినాయకుడిగా కీర్తి గడించారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఏలూరుతో అనుబంధం

కోట శ్రీనివాస రావు ఏలూరు సర్‌ సీఆర్‌ ఆర్‌ రెడ్డి కళాశాలలో 1966 ప్రాంతంలో విద్యాభ్యాసం చేశారు. వారితో పాటు ఇక్కడ ఫ్యాన్సీ డ్రెస్‌ పోటీలలో పాల్గొన్నారు. వీరితో పాటుగా ప్రస్తుతం ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు కూడా పాల్గొన్నారు. ఎన్‌సీసీలో ఫస్ట్‌ కంపెనీకి అండర్‌ ఆఫీసర్‌గా పని చేశారు. ఇలా కోట శ్రీనివాసరావు తొలి దినాలలో ఏలూరుతో విడదీయరాని అనుబంధం ఉంది.

విభిన్న వ్యక్తిత్వం కోట సొంతం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సినీ రంగంలో విభిన్న వ్యక్తిత్వం ఉన్న మంచి మనిషి కోట శ్రీనివాసరావు అని నగరానికి చెందిన నాట్యాచార్యుడు, కళారత్న కేవీ సత్యనారాయణ అన్నారు. కోట శ్రీనివాసరావుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన మృతి కళారంగానికి తీరని లోటని సత్యనారాయణ తెలిపారు. నగరంలోని హిందూ యువజన సంఘం తరపున కోటను సత్కరించి, గౌరవించుకునే అవకాశం లభించడం తమ అదృష్టమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జంతుశాస్త్రం అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ ఎల్‌.శ్యామ్‌కుమార్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ 50 శాతం మార్కులు సాధించాలని, పీహెచ్‌డీ లేదా ఎంఫిల్‌ చేసిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు 15వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అందజేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

పెదపాడు: మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పెదవేగి సీఐ సీహెచ్‌ రాజశేఖర్‌ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్‌ వద్ద తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల పరిశోధనకు డాగ్‌ స్క్వాడ్‌ బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల సరఫరాను నిలుపుదల చేసేందుకు పోలీసుశాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	78	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్‌	38
బీరకాయలు	00	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్‌	112
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్‌	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30-32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్‌	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (ఇంద్ర)	21.00	26
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్‌) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (స్టార్‌ లైనర్‌ నాన్‌ఏసీ స్లీపర్‌)	22.30	10
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్‌	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

ప్రతి కౌలు రైతుకూ రూ.2 లక్షల పంట రుణం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌

ఏలూరు (టూటౌన్‌): రిజర్వ్‌ బ్యాంక్‌ ఆదేశాల ప్రకారం కౌలు రైతులకు రబీ పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు.

ఆదివారం స్థానిక పవర్‌పేట అన్నే భవనంలో కౌలు రైతులకు పంట రుణాల సమస్యలపై ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు అనేక నిబంధనలు పెట్టి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. వ్యవసాయదారులకు ఎటువంటి హామీ లేకుండా పంట రుణాల పరిమితిని రూ.లక్ష 60 వేల నుండి రూ.2 లక్షల వరకు పెంచిందని చెప్పారు. రిజర్వ్‌ బ్యాంకు ఆదేశాల ప్రకారం ప్రతి కౌలు రైతుకు స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌కు అనుగుణంగా రూ. 2 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. భూ యజమాని పంట రుణం పొందారనే పేరుతో కౌలు రైతుకు మొండి చేయి చూపడం తగదన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు పొందిన ప్రతి కౌలు రైతుకు పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీలో కౌలు రైతుల పంట రుణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయిస్తూ ఆదేశాలిస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంట సాగు ద్వారా హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఒత్తిడి చేయాలన్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి వ్యవసాయ పెట్టుబడులు పెట్టడం వలన కౌలు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా నూతన కౌలు చట్టం తీసుకువచ్చి కౌలు రైతులకు మేలు చేయాలని కోరారు. కౌలు రైతుల రుణాలు కోసం బ్యాంకుల ముందు ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఊపందుకున్న వరి నాట్లు

పెదవేగి: గోదావరి నీటితో మెట్ట ప్రాంత రైతులు కొద్దిపాటి ఊరటను పొందారు. సాగు పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. మెట్ట గ్రామాల్లోనూ, బోర్లు కింద ఉన్న పొలాల్లో నాట్లు సగం మేరకు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో అయితే వర్షపాతం చాలక ప్రత్యామ్నాయ పంటలు వేయాలా? వరినే కొనసాగించాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాట్లు ఊపందుకున్నాయి.

ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలి



ఏలూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌ సీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్‌

- ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్‌
- స్క్రీన్‌పై హామీ పత్రాలను చూపుతూ అవగాహన

ఏలూరు టౌన్‌: కూటమి పాలనలో దగాపడ్డ ప్రజల పక్షాన పోరాటం చేస్తూ రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసి మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్‌ పిలుపునిచ్చారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఏలూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ అనుబంధ విభాగాల నేతలు, జిల్లా నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు పార్లమెంట్‌ పరిశీలకులు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌, ఏలూరు పార్లమెంట్‌ ఇన్‌ఛార్జ్‌ కారుమూరి సునీల్‌కుమార్‌, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు హాజరయ్యారు. సమావేశం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

ఏలూరు నేతల ప్రసంగాలు ఇలా ...

ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాట చెబితే చేస్తారనీ, కూటమి నేతలు మోసంతో ప్రజలను మాయ చేస్తారని విమర్శించారు. ఎస్సీ సెల్‌ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్‌ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మూడు దఫాలు ముఖ్యమంత్రి చేసినా ఆయన నాది చెప్పుకోవటానికి ఒక్క పథకమూ లేదన్నారు. వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్‌ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నవరత్నాలను పక్కాగా అమలు చేశారనీ, ప్రతీ పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేశారని తెలిపారు. కార్పొరేటర్‌ ఇమ్మానియేల్‌ జయకర్‌ మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబు రూ.100కోట్లు ఖజానాలో వదిలి వెళితే... మాజీ సీఎం జగన్‌ ప్రభుత్వాన్ని అద్భుతంగా నడిపించారని, ఏనాడు డబ్బులు లేవనే నెపంతో సంక్షేమ పథకాలు ఆపలేదని స్పష్టం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్‌ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ అంబేడ్కర్‌ రాజ్యాంగాన్ని పక్కాగా అమలు చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్‌ తుమరాడ స్రవంతి మాట్లాడుతూ ప్రజలకు ఏడాది కూటమి పాలనతో దారుణంగా మోసపోయామని తెలిసిపోయిందని చెప్పారు. బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మండిపడ్డారు. ఎస్సీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల మేనిఫెస్టోను బాబు, పవన్‌, బీజేపీ విడుదల చేశారనీ, నేడు కూటమి అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మైనార్టీ సెల్‌ అధ్యక్షులు రియాజ్‌ అలీఖాన్‌ మాట్లాడుతూ కూటమి అలవికాని హామీలు గుప్పించి నేడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. సమావేశంలో కార్పొరేటర్లు తంగెళ్ళ రాము, ఇనపనూరి కేదారేశ్వరి, కిలాడి జ్యోతి, పార్టీ నేతలు దాసరి రమేష్‌, బుద్దాల రాము, లంకలపల్లి గణేష్‌, గేదెల సూర్య ప్రకాష్‌, లూటుకుర్తి సుభాష్‌, భాస్కర్ల బాచి, స్టాలిన్‌, పల్లి శ్రీనివాస్‌, బండ్లమూడి సునీల్‌కుమార్‌, పాతినవలస రాజేష్‌, గ్లేవియర్‌ మాస్టార్‌, పిట్టా ధనుంజయ్‌, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, కొల్లిపాక సురేష్‌, కిలారపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

స్క్రీన్‌పై బాబు మోసాలను వివరిస్తూ...

2024 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ ఆనాడు ప్రజలకు అందించిన హామీ పత్రాలను స్క్రీన్‌పై వేస్తూ సమన్వయకర్త జయప్రకాష్‌ వివరించారు. చంద్రబాబు ఏ విధంగా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తోన్న తీరుపై అవగాహన కల్పించారు. ఒక్కో కుటుంబానికి కూటమి నేతలు ఏ విధంగా అలవికాని హామీలు ఇచ్చారో చూపించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అంటూ ఎద్దేవా చేశారు. అమ్మ ఒడి, 18 ఏళ్ల నిండిన మహిళకు నెలకు రూ.1500లు, ఉచిత గ్యాస్‌, ఉచిత బస్‌, యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి ఇలా అనేక హామీలు ఇచ్చి ఏడాది గడచినా ఏవిధంగా మోసం చేస్తున్నారో? ప్రజల్లోకి వెళ్ళి వివరిస్తామని ఆయన తెలిపారు. క్యూఆర్‌ కోడ్‌తో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రతి డివిజన్‌కు వెళ్ళి ప్రతి కుటుంబానికీ ఈ కూటమి సర్కారు ఇవ్వాల్సిన పథకాలు, బకాయి పడిన సొమ్మును వివరిస్తామని సమన్వయకర్త జేపీ స్పష్టం చేశారు.